## క్లుప్తంగా

### 'ఉపాధి' పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పంలో ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న ఫారం పాండ్, జగనన్న ఇంటి నిర్మాణ పనులను మంగళవారం డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. పనులు చేసే ప్రాంతంలో రోజూ ఎన్ఎంఎస్ఎస్ యాప్‌లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలని, సరిహద్దు కందకాలు, మామిడి తోటలకు పాదుల పనులను గుర్తించి చేయాలని ఆదేశించారు. ఏపీఓ హంసవేణి, టెక్నికల్ అసిస్టెంట్లు ఆరోగ్య, సుదర్శన్, రమేష్, క్షేత్ర సహాయకులు పురుషోత్తం పాల్గొన్నారు.

### రెడ్డి సంఘం రాష్ట్ర సలహాదారుడిగా మహీధర్‌రెడ్డి



తిరుపతి కల్చరల్: ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర సలహాదారుడిగా ముళ్లపూడి మహీధర్‌రెడ్డిని నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డి సంఘాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రెడ్ల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని మహీధర్‌రెడ్డి తెలిపారు.

### ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడండి



పూల దుకాణాల యజమానులతో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

పాకాల : పట్టణంలో నిర్వహిస్తున్న పూల దుకాణాలు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్వహించాలని సీఐ రాజశేఖర్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో పూల దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి సీఐ మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వ్యాపార స్థలాల్లో రద్దీగా ఉంటుందని, రోడ్డు స్థలాల్లో ముందుకు వచ్చి పూలు, పూల మాలలను ఉంచరాదన్నారు. అలాగే దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు నిలపకుండా చూసుకోవాలన్నారు.

### విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలి



స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు

తిరుమల: విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని ఆ పరిశ్రమ ఉద్యోగులు జె.రామారావు, ఎన్.విష్ణుశయనబాబు మంగళవారం శ్రీవారిని ప్రార్థించారు. విశాఖపట్టణానికి చెందిన వారిద్దరూ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు. విశాఖ స్టీలు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో వీరిద్దరూ వైజాగ్ నుంచి గత ఏడాది డిసెంబర్ 17న కాలినడకన బయలుదేరి ఈనెల 8న తిరుపతికి చేరుకున్నారు. అనంతరం 9న అలిపిరి నడకమార్గం మీదుగా తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖస్టీల్ ప్లాంట్‌ను విక్రయించే ప్రతిపాదనలను విరమించుకోవాలని, స్టీల్ ప్లాంటుకు సొంతంగా గనులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని లేనిపక్షంలో రూ.20 వేల భృతిని ఇచ్చేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకునేలా చూడాలని శ్రీవారిని ప్రార్థించినట్లు చెప్పారు.

### జోరుగా కోడిపందాలు, జూదం

- చోద్యం చూస్తున్న పోలీసులు
- తలకోనలో పట్టుబడ్డ మద్యం బాటిళ్లు ఏమవుతున్నాయో?



తలకోనలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుబాటిళ్లు (ఫైల్)

ఎర్రావారిపాళెం: మండలంలో జోరుగా కోడిపందాలు, జూదం సాగుతున్నాయి. యల్లమంద సమీపంలోని మడుగు, కోటకాడపల్లె, బోడేవాండ్లపల్లె సమీప మామిడితోటలు పేకాట స్థావరాలుగా మారాయి. ఉదయమాణిక్యం–రొంపిచర్ల సరిహద్దు, బోడేవాండ్లపల్లె ప్రాంతంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు స్థానిక పోలీసులకు సమాచారం వస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. అలాగే తలకోన క్షేత్రం వద్ద పట్టుబడుతున్న మద్యం బాటిళ్లు పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. అయితే వాటిపై కేసులు నమోదు చేయకపోగా, మహారాష్ట్ర నుంచి వచ్చిన పర్యాటకుల నుంచి సొమ్ము చేసుకుని విడిచి పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారులైనా దీనిపై దృష్టి సారించి వీటికి అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# మునిసిపల్ కార్మికుల సమస్యల్ని పరిష్కరిస్తాం

- కమిషనర్ అనుపమ అంజలి హామీ
- యూనియన్ నేతలతో చర్చలు, సమ్మెకు తెర



మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా : మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి హామీతో సమ్మెకు తెరపడింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ నెల 17 నుంచి సమ్మెకు పిలుపునిచ్చిన మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో మంగళవారం కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యూనియన్ నాయకులు తులసేంద్ర, దొరస్వామితో చర్చించారు. ప్రధానంగా తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న కార్మికుల్లో కొందరికి జీతాలు సక్రమంగా రాకపోవడంతో ఆ కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని యూనియన్ నేతలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందించారు. రెండు నెలల జీతాన్ని తక్షణమే విడుదల చేశారు. మిగిలిన బకాయి జీతాలను కూడా త్వరలో ఇస్తామని, కార్మికులకు బీమా, పీఎఫ్ లాంటివి పెండింగ్ లేకుండా చేస్తామని, చెత్తసేకరణ వాహనాలకు ఎఫ్‌సీ చేస్తామని, కొన్ని డిమాండ్లను వచ్చే కౌన్సిల్ సమావేశంలో చర్చించి ఆమోదిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. దీంతో సమ్మె నోటీసును యూనియన్ నేతలు ఉపసంహరించుకున్నారు. కార్మికులు చిత్తశుద్ధితో నగరాభివృద్ధికి కృషి చేస్తారని, తమ సమస్యలపై స్పందించిన అధికారులకు, పాలకవర్గానికి యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుమాలిక మోహన్, హెల్తాఫీసర్ డాక్టర్ హరికృష్ణ, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

**నైట్ సెంటర్‌ను తనిఖీ చేసిన కమిషనర్**



నైట్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా : స్థానిక పట్నాల వీధిలోని రాత్రి బస కేంద్రాన్ని (నైట్ షెల్టర్) నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కేంద్రంలో నాణ్యమైన భోజన వసతి, వైద్య సదుపాయాలు బాగా ఉండేలా చూడాలని, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ నెల 11న సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ (న్యూఢిల్లీ) ఈ కేంద్రాన్ని తనిఖీ చేయనున్న నేపథ్యంలో ఇక్కడి పరిశీలనకు వచ్చినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ బస్వా గీత, మెప్మా పీడీ రాధమ్మ, డీఈ గోమతి, సోషల్ వెల్ఫేర్ డీడీ చెంచయ్య, హోప్ సంస్థ ప్రతినిధి కవిత, మెప్మా సీఎంఎం రమణ, సోమశేఖర్, శ్రీరాములు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఎఫ్‌టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



ఐఎఫ్‌టీయూ2023 క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి హరికృష్ణ, జిల్లా నేతలు



పాకాల : ఎస్టీయూ క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ బాబ్జి

తిరుపతి కల్చరల్: కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రధాని మోదీ తీసుకువచ్చిన నాలుగు కోడ్లను రద్దు చేసే వరకు కార్మిక పోరాటాలు సాగించాలని, ఇందుకు తాము అండగా ఉంటామని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాయపనేని హరికృష్ణ అన్నారు. ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో సంఘం నూతన క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కె.సుబ్రమణ్యం, అధ్యక్షురాలు భారతి, నాయకులు వెంకటరత్నం, విజయకుమార్, మోబినా, శోభ,నాగరత్నం, కవిత పాల్గొన్నారు.

**పాకాలలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లు..**

పాకాల : స్థానిక ఎన్‌వీఎన్ పాఠశాల ఆవరణలో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను మంగళవారం ఎంఈఓ బాబ్జి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎస్టీయూ శాఖ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి చిట్టిబాబు, జిల్లా కౌన్సిలర్ జార్జి, మురళీధర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్వీయూ రెక్టార్ పదవి దళిత ఆచార్యులకు ఇవ్వాలి



చర్చా వేదికలోమాట్లాడుతున్న ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ చిరంజీవి

తిరుచానూరు: ఎస్వీ యూనివర్సిటీలో ఖాళీగానున్న రెక్టార్ పదవిని దళిత ఆచార్యులకు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్వీయూలోని అన్నమయ్య భవన్‌లో విద్యార్థి మేధావుల చర్చా వేదిక నిర్వహించారు. బి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎంఆర్‌పీఎస్ నేతలు రాఘవులు, రామచంద్రయ్య, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు పెద్దపీట వేస్తూ వారి అభ్యున్నతికి తోడ్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయంలోని ఉన్నత పదవుల్లో ఒకటి దళితులకు కేటాయించాలని కోరారు. ఇప్పటికైనా విశ్వ విద్యాలయం పాలక మండలి సభ్యులు, ఉపకులపతి, దళిత ఆచార్యులకు సముచిత స్థానం కల్పించాలని, లేని పక్షంలో ఎస్వీయూ పరిపాలనా భవనాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

## మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేద్దాం



మాట్లాడుతున్న రైల్వే ఇన్‌స్పెక్టర్

తిరుపతి అర్బన్ : మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయడానికి అందరి కృషి అవసరమని తిరుపతి రైల్వే ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ అన్నారు. మానవ అక్రమ రవాణాను నిరోధించడంపై మంగళవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రైల్వే స్టేషన్‌లో అనుమానితులు కనిపిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 139, 1098, 100, 181కు సమాచారం ఇవ్వాలని, అలాగే ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే 1098–139 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలన్నారు. రైళ్లలో ప్రయాణిస్తున్నప్పుడు ప్రయాణికులు తమ వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

## టీచర్ల సమస్యలు పరిష్కరించరూ!



సమావేశంలో మాట్లాడుతున్న జ్యోతి ప్రసాద్

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల సమస్యల పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బీటీఏ నాయకులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక ఎన్‌వీఎన్ పాఠశాల ఆవరణలో బీటీఏ రాష్ట్ర సలహాదారు గుండ్లపల్లి ఆంజనేయులు అధ్యక్షతన ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు జ్యోతిప్రసాద్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఏడు డీఏ బకాయిలను చెల్లించాలని, అలాగే పెన్షనర్లకు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు నెల మొదటి తేదీనాడే జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు ఆదికేశవులు, కృష్ణమూర్తి, విజయమోహన్, బంగారురాజు, గోపాలయ్య, వెంకటయ్య, రామమూర్తి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.




స్విమ్స్ ఎదురుగా చెట్ల నీడన సేదదీరుతున్న ప్రజలు

పచ్చని చెట్ల నీడలో ప్రజలు సేదదీరుతున్న ఈ దృశ్యాలను చూస్తే చెట్ల విలువేమిటో ఇట్టే తెలుస్తుంది. మానవాళికి చెట్ల అవసరత ఎంత ముఖ్యమో చెప్పకనే చెబుతాయి. పర్యావరణ పరిరక్షణలో చెట్లు పోషిస్తున్న పాత్ర ఎంతో ఉంది. కాంక్రీట్ జనారణ్యంలో ప్రాణవాయువునే కాదు.. సేదదీరేందుకు చల్లని నీడనూ ప్రసాదిస్తున్న వృక్ష సంపదను పరిరక్షించుకోవడం మన ధర్మం. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



అలిపిరి పాత చెక్‌పాయింట్ వద్ద..

## హమాలీ కార్మికుల ధర్నా



తిరుపతి అర్బన్: సివిల్ సప్లైస్ హమాలీ కార్మికులు మంగళవారం కలెక్టరేట్ ఎదుర ధర్నా చేశారు. తమకు అరియర్స్‌ను వెంటనే చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీ పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి ఎస్ డి.రవి, సివిల్ సప్లైస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అయ్యప్ప, హమాలీ కార్మికులు చెంచయ్య, ముత్తు, పళిణికుమార్ , సుబ్రహ్మణ్యం ప్రకాష్, మురళి పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో బ్లాకుల పరిశీలన



పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకుగాను మంగళవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి పలు బ్లాక్‌లతోపాటు గ్రౌండ్ ఫ్లోర్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బీ అధికారి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ట్యాంకు క్లోరినేషన్‌కు సిద్ధం చేస్తున్న ఉద్యోగులు

భాకరాపేట : సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలను అప్రమత్తం చేయాలని జంగావాండ్లపల్లె గ్రామ సర్పంచ్ సింహాల విమల అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, పేడ దిబ్బలను తొలగించాలని కోరారు. ట్యాంకులను క్లోరినేషన్ చేయిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి వెంకటమోహన్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్గోలో బల్క్ బుకింగ్ సౌకర్యం

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గోలో బల్క్ బుకింగ్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్గో జిల్లా ఇన్‌చార్జి సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఇక్కడ సాధారణ బుకింగ్‌తోపాటు 10 టన్నుల వరకు బల్క్ బుకింగ్ సౌకర్యం ఉందని పేర్కొన్నారు. రూఫ్‌టాప్ బుకింగ్, డీజీటీ బుకింగ్ సౌకర్యాలు యథావిధిగా ఉంటాయని తెలియజేశారు. పూర్తి వివరాలకు డీఎంఈ ఏకాంబరంను 80749 62104లో సంప్రదించాలని కోరారు.

## గిరిజనులకు శ్మశానం కేటాయింపు



ఆముదాకోన ఎస్టీ కాలనీ వాసులకు శ్మశాన స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

చంద్రగిరి: ఆముదాలకోన ఎస్టీ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న శ్మశానం సమస్య ఎట్టకేలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చొరవతో తీరింది. తరతరాలుగా కాలనీవాసులు అటవీ ప్రాంతాన్ని శ్మశానంగా వినియోగిస్తున్నారు. ఇటీవల అటవీ అధికారులు ఆక్షేపించడంతో శ్మశాన సమస్యను వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు దేవారెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో ఆర్డీఓ కనక నరసారెడ్డి ఆముదాలకోన కాలనీని పరిశీలించి శ్మశానం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం తహసీల్దార్ శిరీష గ్రామస్తులకు 30 సెంట్ల స్థలాన్ని శ్మశానం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో వీఆర్ఓ వెంకన్న నాయుడు. ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంప్రదాయ వేషధారణలో సంక్రాంతి పండుగను జరుపుకుంటున్న భాష్యం విద్యార్థులు



రెడ్ చెర్రీస్‌లో సంప్రదాయ వేషధారణలో ఉన్న చిన్నారులను ఆశీర్వదిస్తున్న ఉపాధ్యాయులు

తిరుపతి ఎడ్యుకేషన్ : రెడ్‌చెర్రీస్ పాఠశాలలో మంగళవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. పల్లె సంస్కృతిని చాటి చెబుతూ చిన్నారులు రైతులు, హరిదాసుల వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు పాఠశాల డైరెక్టర్లు ఎస్.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎస్.పద్మజ వివరించారు. అలాగే వరదరాజనగర్‌లోని భాష్యం పాఠశాలలో ఇవే వేడుకలను నిర్వహించారు. తల్లిదండ్రులకు రంగవల్లులు, పతంగులు, పిండి వంటల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. చిన్నారులను భోగి పండ్లతో ఆశీర్వదించారు.

**'సంక్రాంతి లక్ష్మి'కి స్వాగతాంజలి**



కళాకారులను పురస్కారాలతో సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి సంక్రాంతి వేడుకల్లో భాగంగా టీఎంఆర్ కల్యాణ మండపంలో రంగవల్లులు తీర్చిదిద్ది, పతంగులు ఎగురవేసి సంక్రాంతి లక్ష్మికి కళాకారులు స్వాగతం పలికారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి, సాంప్రదాయాలకు దర్పణాలని, వాటి ప్రాశస్త్యాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సంక్రాంతి గొప్పదనాన్ని తెలియజేయడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం కళాకారులు కె.కేశవులురెడ్డి, ఎం.కోదండపాణి, చంద్రబాబు, పొన్నాల జేజిరెడ్డి, ఎం.గంగయ్య, శోభారాణి, కె.సాయి నవీన, ఎం.కవిత, కల్యాణి, కుసుమమ్మ, టి.సుబ్రమణ్యంరెడ్డిని శ్రీకృష్ణదేవరాయ పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రంగస్థలి కార్యదర్శి కేఎస్.రాజా,సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

## తొలి ప్రయత్నంలోనే సీఏ పూర్తి



హేమాన్విత

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతికి చెందిన ఇసనాకుల హేమాన్విత(21) తొలి ప్రయత్నంలోనే చార్టెర్డ్ అకౌంటెంట్(సీఏ) ఫైనల్ పూర్తి చేసి శభాష్ అనిపించుకుంది. ఎమరాల్డ్స్ విద్యాసంస్థ డైరెక్టర్ ఈ.గిరిధర్‌రెడ్డి, స్విమ్స్ జనరల్ మేనేజర్ ఎం.ప్రసన్నలక్ష్మి దంపతుల కుమార్తె హేమాన్విత సీఏ ఫౌండేషన్, ఇంటర్‌ను ఎమరాల్డ్స్ కళాశాలలో పూర్తి చేసింది. సీఏ ఫైనల్‌ను ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా సిద్ధమవుతూ ఈ పరీక్షలో తొలి ప్రయత్నంలోనే అద్భుత విజయాన్ని అందుకుంది. పలువురు ఆమెను అభినందించారు.

## పోగొట్టుకున్న బ్యాగ్ అప్పగింత



రాజస్థానీయులకు బ్యాగును అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

తిరుమల: పాప వినాశనం వద్ద బస్సులో రాజస్థాన్ భక్తులు మరచిపోయిన బ్యాగును తిరిగి వారికి అప్పగించారు. ఆ బ్యాగ్‌ను తిరుమల డిపో బస్ కండక్టర్ గీత గుర్తించి అందులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా భక్తులను గుర్తించి అప్పగించారు. బ్యాగులో విలువైన కెమెరా, నగదు, ఆధార్ కార్డులు, దర్శనం టికెట్లు కూడా ఉన్నాయి.

## జాతీయ యువజనోత్సవాలకు మహిళావర్సిటీ వలంటీర్లు



యువజనోత్సవాలకు ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న రిజిస్ట్రార్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్

తిరుచానూరు: కర్ణాటక రాష్ట్రం హుబ్లీలోని ధార్వాడ్‌లో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ యువజనోత్సవాలు–2023కి శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.మాధవి వలంటీర్లు ఐవీఎన్ శ్రావ్య, జి.భవాని, రీజినల్ యూత్ ఆఫీసర్ నుంచి అనుమతి పొందిన మరో 12 మంది వలంటీర్లు ఎంపికయ్యారు. వీరిని ఎస్వీయూ రిజిస్ట్రార్ రజని, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కాత్యాయని, ఎన్ఎస్ఎస్ యూనిట్–2 పీఓ డాక్టర్ కె.స్వాతి అభినందించారు.

## 'నేచర్' చిత్రం ట్రైలర్ విడుదల రేపు



మాట్లాడుతున్న దర్శకుడు సుధాకర్

తిరుపతి కల్చరల్: శ్రీసప్తమ్ క్రియేటివ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై నిర్మిస్తున్న 'నేచర్' చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమం ఈనెల 12న గురువారం సాయంత్రం 6 గంటలకు స్థానిక ఇందిరా మైదానంలో నిర్వహిస్తున్నట్లు ఆ చిత్ర నిర్మాత టి.చేతన్, దర్శకుడు టి.సుధాకర్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సామాజిక సందేశం, కమర్షియల్ విలువలతో భావితరాలకు సందేశాత్మకంగా ఈ చిత్రం తీసినట్లు పేర్కొన్నారు. హీరోగా బి.కృష్ణ, హీరోయిన్లుగా, ముస్కాబిష్క్, కరిష్మారాయ్ నటించారని తెలిపారు. ప్రజలందరూ హాజరై ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో చిత్ర యూనిట్ ప్రతినిధులు టి.రవి, రాజేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## వీఆర్వోల అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



నాగరాజును సత్కరిస్తున్న తహసీల్దార్ శిరీష

చంద్రగిరి: చంద్రగిరి వీఆర్‌ఓగా పనిచేస్తున్న రామానుపల్లి నాగరాజు, తిరుపతి జిల్లా వీఆర్‌ఓల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆయన్ను తహసీల్దార్ శిరీష తన కార్యాలయంలో సిబ్బందితో కలసి సత్కరించారు. ఆమె మాట్లాడుతూ, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నాగరాజు ముందుంటారని, అదే కోవలో జిల్లాలోని వీఆర్‌ఓల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీటీలు ఈశ్వర్ రెడ్డి, అమృత, మోహన్ రెడ్డి, ఆర్ఐ సులోచన, వీఆర్‌ఓలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడల్లో పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారిణిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ సుకుమార్

చంద్రగిరి: ఇటీవల జరిగిన 25వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ పోటీలలో అగరాల సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ డాక్టర్ సుకుమార్ మంగళవారం తెలిపారు. టీటీ, చెస్, ట్రిపుల్ జంప్, జావెలిన్ త్రో, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందుకున్నారని చెప్పారు. క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో పీడీ శంకర్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.